క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలు అందించాలి



మాట్లాడుతున్న సంగెం బొర్రన్న

ఇచ్చోడ: ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. జిల్లాలోని ఇచ్చోడ, సిరికొండ, భీంపూర్, బజార్‌హత్నూర్, బేల, నార్నూర్ మండలాల్లో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి తనిఖీ చేయడంతోపాటు నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై పీడీయాక్ట్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లైసెన్స్ ఉన్న షాపుల్లోనే రైతులు విత్తనాలు కొని రసీదు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రైతుల శంకర్, నాగోరావు, అడేల్లు, అనిల్ ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం



మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

నేరడిగొండ: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరిచేరవని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. ఫీవర్ సర్వేలో భాగంగా మండలంలోని సవర్గాంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం పవార్ జ్యోతి, ఆశ కార్యకర్త గౌరీబాయి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్లు పరిశీలన



జొన్న కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీఎం ప్రవీణ్‌రెడ్డి

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో జొన్న కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. ఈనెల చివరివరకు కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు జొన్నలను మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, సొసైటీ సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి



దామోదర్ (ఫైల్)

జైనథ్: విద్యుత్‌షాక్‌తో కౌలు రైతు మృతి చెందినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సాంగ్వి(కె) గ్రామానికి చెందిన బోయర్ దామోదర్ (50) జొన్న పంట సాగు చేస్తున్నాడు. వర్షం నేపథ్యంలో గురువారం పంట పరిస్థితి చూసేందుకుని అక్కడికి వెళ్లాడు. పొలం చుట్టూ బిగించిన సోలార్ కంచె పై పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఉంది. గమనించకుండా సోలార్ దాటే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భార్య సవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కల పెంపకంలో జాగ్రతలు తీసుకోవాలి

ఇచ్చోడ: నర్సరీలో మొక్కల పెంపకంలో జాగ్రతలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం నర్సరీని గురువారం పరిశీలించి మాట్లాడారు. జూన్ మాసం నాటికి మొక్కలు సిద్ధంగా ఉండాలన్నారు. నర్సరీలో సీతాపల్, ఖర్జూర, ఈత, మునగ మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు.

అన్నదానం చేయడం అభినందనీయం

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పంటలు అమ్ముకోవడానికి వచ్చే రైతుల కోసం అన్నదానం చేయడం అభినందనీయమని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి అన్నారు. గత 13 రోజులుగా రైతులకు నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గొర్ల రాజు యాదవ్‌ను అభినందించారు. వారితో కలిసి అన్నదానంలో పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మెర్గు భోజన్న, గడ్డల నారాయణ తదితరులు ఉన్నారు.

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం

- ఆదిలాబాద్‌రూరల్ మండలంలో నాలుగు గ్రామాలు ఎంపిక
- నీతి ఆయోగ్, రైతు ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో ఉచిత విత్తనాలు
- సకాలంలో విత్తనాలు అందిస్తే మేలు

మండలంలో 7 క్లస్టర్లు

పంట	ఎకరాలు
పత్తి	34 వేలు
సోయాబీన్	3 వేలు
కంది	3 వేలు



రైతులతో సమావేశమైన వ్యవసాయ అధికారులు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. మండలంలో ప్రధానంగా రైతులు పత్తి, సోయాబీన్‌తోపాటు ఇతర పంటలు సాగుచేస్తారు. రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకంతో పెట్టుబడి పెరిగిపోతోంది. ఈక్రమంలో అన్నదాతల పెట్టుబడి తగ్గించి, పంట అధిక దిగుబడి సాధించాలనే లక్ష్యంతో సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. ఈ సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని మలేబోరిగాం, పాచ్పర, దిమ్మ, అంకోలి గ్రామాలు ఇటీవల ఎంపికయ్యాయి. ఒక్కో గ్రామంలో 125 మంది రైతులకు నీతి ఆయోగ్, రైతు ఉత్పత్తి సంఘం ద్వారా ఉచితంగా విత్తనాలు అందించనున్నారు.

ఒక్కో గ్రామంలో ఒక్కో పంట సాగు

సేంద్రియ సాగుకు నాలుగు గ్రామాలు ఎంపిక కాగా, ఒక్కో గ్రామంలో ఒక్కో పంట సాగు చేయనున్నారు. దిమ్మ, పాచ్పర గ్రామాల్లో నూనె గింజల పంట సాగు చేసేందుకు నిర్ణయించగా, అంకోలి, మలేబోరిగాం గ్రామాల్లో పత్తి సాగుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఎంపికైన గ్రామాల్లో మరో రెండు, మూడు రోజుల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘం, ఎన్‌జీవోల ఆధ్వర్యంలో పండించే పంటల ఎంపికపై రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. వర్షాలు ప్రారంభం కన్నా ముందుగానే అధికారులు విత్తనాలు అందిస్తే విత్తుకునే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. జాప్యం జరిగితే విత్తనాలు సకాలంలో విత్తుకోలేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

రెండు రోజుల్లో సమావేశాలు



మండలంలోని నాలుగు గ్రామాలను ఎంపిక చేశాం. ఎంపికైన రైతులకు నీతి ఆయోగ్, రైతు ఉత్పత్తిదారుల సంఘం, ఎన్‌జీవో సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయనున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా సంఘాలతో కలిసి రైతులతో సమావేశాలు నిర్వహించనున్నాం. ప్రస్తుతం వారి ఎంపిక తుది దశలో ఉంది.

– నాగేశ్‌రెడ్డి, ఏవో, ఆదిలాబాద్ రూరల్

యజమాని నిర్వాకం.. డ్రెయినేజీపై నిర్మాణం



డ్రెయినేజీపై చేపట్టిన నిర్మాణం

కై లాస్‌నగర్: పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్‌బోర్డు కాలనీ పరిధిలో ఓ ఇంటి యజమాని నిర్వాకం చుట్టుపక్కల కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది. మురుగునీరు ప్రవహించే డ్రెయినేజీపై ఇష్టారాజ్యంగా ర్యాంపు నిర్మాణం చేపట్టడంతోపాటు డ్రెయినేజీపై సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేశారు. దీంతో ఎగువభాగం నుంచి వచ్చే మురుగునీరు ముందుకు సాగే అవకాశం లేక నిలిచిపోతుంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై సదరు ఇంటి యజమానికి విన్నవించడంతోపాటు బల్దియా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్దియా అధికారులు ఇప్పటికైన స్పందించి తమ సమస్యను పరిష్కరించేలా చూడాలని కోరుతున్నారు.

పత్తి అధిక దిగుబడికి సస్యరక్షణ చర్యలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

బజార్‌హత్నూర్: పత్తి అధిక దిగుబడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని చింతలసాంగ్వి గ్రామంలో ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోయాబీన్ కాండం తొలుచు పురుగు, కందిలో ఎండుతెగులు నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. సోయ, పత్తి, మొక్కజొన్న, ఆయిల్‌పాం పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు. ఏటా పంట మార్పిడి, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు తర్వాత రసీదులు భద్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శివచరణ్, ఏవో మహ్మద్ సాద్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

టీజేఎఫ్ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈనెల 31న తలపెట్టిన తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సభకు జర్నలిస్టులు స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేయాలని టీయూడబ్ల్యూజె (హెచ్–143) జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద గురువారం టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్లను జర్నలిస్టులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనోద్యమంలో కీలక పాత్ర పోషించిన టీజేఎఫ్ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహించే రజతోత్సవ సభకు జర్నలిస్టులు హాజరుకావాలని కోరారు. టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు ఎం ఏ.అన్వర్, నాయకులు డీవీఆర్ ఆంజనేయులు, సుభాష్, ఎం.సంతోష్, రత్నాకర్, రమేష్, గజానంద్, తేజ, నీలేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఈవో వెంకట్‌రావు

తలమడుగు: మహిళల్లో సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈవో వెంకట్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని సెర్ప్ మహిళా గ్రూప్ సభ్యులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్ టు డోర్ సర్వే చేసి నిరక్షరాసులైన మహిళలను గుర్తించి, వారిలో 10 మందికి ఒకరి చొప్పున విద్య బోధన చేయాలన్నారు. మూడు నెలల తర్వాత వారికి ఒక పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. పదో తరగతి లోపు డ్రాపౌట్స్‌గా మిగిలిపోయిన వారిని 10వ తరగతి, ఇంటర్ పాస్ కానివారికి ఓపెన్ హై స్కూల్ ఓపెన్, ఇంటర్ ద్వారా ఎన్‌రోల్‌మెంట్ చేసి పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఏపీఎం చంద్రశేఖర్, సీసీ, వీవోఏలు, సెర్ప్ గ్రూప్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాంసి ప్రాథమిక పాఠశాల సందర్శన

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు సందర్శించారు. ఉపాధ్యాయుల ఐదు రోజుల ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలో భాగంగా జెడ్పీ పాఠశాలలో శిక్షణ నిర్వహిస్తున్నారు. శిక్షణలో భాగంగా పాఠశాల వనరులు, ఉపాధ్యాయులతోపాటు పోషకుల భాగస్వామ్యం అనే అంశంపై ఇక్కడి పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, బోధన, వి ద్యార్థుల ఆకర్షణ కోసం కళాత్మకంగా వేసిన పెయింటింగ్స్ పరిశీలించారు. పాఠశాలలో సొంతంగా తన కళతో పెయింటింగ్స్ వేసిన ఉపాధ్యాయురాలు కవితను అభినందించారు. ఎంఈవో శ్రీకాంత్, శిక్షకులు గంభీర్, శ్రీనివాస్, పొచ్చన్న ఉన్నారు.

వివాహ వేడుకలో ఎంపీ నగేశ్

బజార్‌హత్నూర్: మండలంలోని చందు నాయక్ తండా గ్రామానికి చెందిన పద్వల్ రాజు–సునీత దంపతుల కుమార్తె లక్ష్మి వివాహ వేడుకలో గురువారం ఎంపీ నగేశ్ పాల్గొన్నారు. వధూవరులు లక్ష్మి, గురుబక్‌సింగ్‌లను ఆశీర్వదించారు. ఆయన వెంట మేకల వెంకన్న, అల్కే గణేశ్, రాజేశ్వర్, నానం రమణ, నానక్‌సింగ్, నందినర్సయ్య పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్, పిట్టబొంగరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను గురువారం ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్ పరిశీలించారు. కలెక్టర్ రాజర్షి షా, డీఆర్‌డీవో రాథోడ్ రాజేశ్వర్ ఆదేశాలతో నర్సరీల్లో ఇతర మొక్కలతోపాటు వెయ్యి చొప్పున ఇప్ప పువ్వు విత్తనాలు నాటినట్లు తెలిపారు. ఇప్పటికే ఇప్ప పువ్వు విత్తన సేకరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పపువ్వు మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎడిటర్ల సంఘం కార్యవర్గం

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా ఎడిటర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఫిరోజ్ ఖాన్, ఉపాధ్యక్షుడు అమృత్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్‌కుమార్, కోశాధికారిగా సత్యనారాయణ, సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ కరీం, డివిఆర్ ఆంజనేయులు, సయ్యద్ ఖమర్, రాజు రాథోడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు ఎలుగు లింగన్న తెలిపారు.

పారితోషికం చెల్లించాలి

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం గతేడాది చేపట్టిన కులగణన సర్వేలో విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులు కోరారు. ఉపాధ్యాయులు కాంబ్లే విజయ్‌కుమార్, ఆత్మారాం, రాజ్‌కుమార్, అభిలాష్, సంతోష్, కపిల్, జీవన్, పుండలిక్, రవి, అమోల్, సుకుమార్ శ్రీలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

మూసి ఉన్న కల్వర్టు



ఇచ్చోడ: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మించిన కల్వర్టు మూసి ఉండటంతో భారీ వర్షాలకు ముప్పు పొంచి ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల నుంచి వచ్చే వరద నీరు కల్వర్టు గుండా ప్రవహిస్తుంది. కానీ కల్వర్టు మూసి ఉండటంతో రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండంతో ప్రమాదం పొంచి ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మూసి ఉన్న కల్వర్టును తెరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గుండెపోటుతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మృతి



దుర్గం సుజాత (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: గుండెపోటుతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలం రాజన్నగూడకు చెందిన సుజాతకు శ్యాంపూర్ పరిధిలోని గోదరిగూడకు చెందిన రమేశ్‌తో 23 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. శ్యాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న సుజాత(45)కు 12 ఏళ్ల క్రితం పదోన్నతి పొంది కుమురం భీం జిల్లాకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సుజాత గురువారం గోదరిగూడకు ఆర్టీసీ బస్సులో పయనమయ్యారు. జైనూర్ సమీపాన చేరుకోగా గుండె నొప్పి వస్తుందని తెలపడంతో తోటి ప్రయాణికులు ఉట్నూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందింది.

అకాల వర్షం..తడిసిన ధాన్యం



మొలకెత్తిన వరి ధాన్యం



తడిసిన ధాన్యం చూపిస్తున్న రైతు

ఉట్నూర్‌రూరల్: మండలంలో బుధ, గురువారాల్లో కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం తడిసిపోయాయి. గంగన్నపేట కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు త్వరితగతిన చేపడితే తమకు నష్టం జరిగేది కాదని వాపోయారు. ఓ వైపు ధాన్యంపై కవర్లు, మరోవైపు కొనుగోలు కోసం గన్నీ సంచులు అందుబాటులో లేవని పేర్కొన్నారు. వర్షానికి ధాన్యానికి మొలకలు వచ్చాయన్నారు. కొనుగోలు కేంద్రానికి 15 రోజుల నుంచి వచ్చి ఉన్నామని త్వరగా కొనుగోళ్లు చేపడితే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. కాగా, ఇప్పటివరకు 1200 క్వింటాళ్లు కొనుగోలు చేశామని, మరో 600 క్వింటాళ్లు కొనుగోలు చేయాల్సి ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

20 రోజులైంది



కొనుగోలు కేంద్రానికి వచ్చి 20 రోజులవుతుంది. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి తడిసి మొలకలు వచ్చాయి. 8 ఎకరాల్లో ధాన్యం సాగు చేసి తీసుకువచ్చాం. ముందుగా కొనుగోలు చేపడితే వర్షానికి తడిసేది కాదు.

– పాకల నర్సింలు, రైతు

కొనుగోలు చేయాలి



వర్షానికి ధాన్యం తడిసింది. నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయలేదు. ఒక్కసారిగా కురిసిన వానకు ధాన్యం తడిసి పోయింది. కురుస్తున్న వర్షాలకు ఆరబెట్టే పరిస్థితి లేదు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

– వినోద్, రైతు

తడిసిన జొన్నలు



తాంసి మార్కెట్‌లో జొన్నలపై కప్పిన టార్పాలిన్లు

తాంసి: మండల కేంద్రంతోపాటు తాంసి, వడ్డాడి, గిరిగాం, పాలోది, అంబుగాం, కప్పర్ల, పొన్నారి, హస్నాపూర్, బండల్‌నాగాపూర్ గ్రామాల్లో గురువారం గంటకు పైగా ఏకధాటిగా వాన కురిసింది. మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రానికి పంట తీసుకువచ్చిన రైతులకు ఇబ్బంది తప్పడం లేదు. బుధవారం కురిసిన వర్షానికి కొంతమేర జొన్నలు , గురువారం పలువురు రైతుల జొన్నలు తడిసిపోయాయని వారు ఆందోళన చెందారు. అధికారులు తడిసిన జొన్నలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ఇంద్రవెల్లిలో వర్షం



మండలకేంద్రంలో కురుస్తున్న వర్షం

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా గంటపాటు వర్షం కురవడంతో హీరాపూర్, భగత్‌సింగ్‌నగర్, గోపాల్‌పూర్, చిత్తబట్ట, సకారంతండా తదితర గ్రామాల మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. దీంతో పలువురు ఇబ్బంది పడ్డారు.

వంగిన స్తంభం సరిచేయరూ..



బేల: మండలంలోని డోప్టాల రెవెన్యూ గ్రామ శివారు లోని రైతు మంచాల రామకృష్ణ పొలంలో విద్యుత్ స్తంభం వంగిపోయింది. మూడు నెలలుగా స్తంభం వంగి పడిపోయేలా ఉంది. ఈ విషయాన్ని లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయించాలని కోరుతున్నారు.

శబరిమాత చూపిన మార్గంలో నడవాలి

ఇచ్చోడ: శబరిమాత చూపిన మార్గంలో యువత నడవాలని రాష్ట్ర అధ్యాపకులు సంఘం ప్రధాన కార్యదర్శి బలరాంజాదవ్ పేర్కొన్నారు. మండలంలోని అడేగామ(బి)లో గురువారం నిర్వహించిన శబరిమాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. అమ్మపాదుకలతో నిర్వహించిన పల్లకి సేవలో పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల శబరి మాత ఆశ్రమాల ద్వార ప్రతీరోజు ఆధ్యాత్మికత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీజేపీ బోథ్ అసెంబ్లీ కన్వీనర్ కథం బాబారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్..కంపు కంపు



ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రైతుబజార్ చెత్తాచెదారంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చెడిపోయిన కూరగాయలు, ఇతర మురిగిన పండ్లు ఎక్కడపడితే అక్కడే పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అదేవిధంగా ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్తాచెదారం కుప్పలుతెప్పలుగా పడేయడంతో అస్తవ్యస్తంగా తయారైంది. సంబంధిత అధికారులు పారిశుధ్యంపై దృష్టిసారించాలని వినియోగదారులు కోరుతున్నారు.